క్లుప్తంగా

సహాయ వంట మనిషి నియామకానికి దరఖాస్తు

నిడమనూరు : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న సహాయ వంట మనిషి నియామకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మహిళ అయి ఉండి 18ఏళ్ల నుంచి 45ఏళ్ల వయస్సుతో పాటు ఏడో తరగతి పాస్ అయి ఉండాలని తెలిపారు. ఈ నెల 27వ తేదీ వరకు దరఖాస్తులను మండల వనరుల కేంద్రం నిడమనూరులో ఆధార్ కార్డు, ఏడో తరగతి మార్కుల మెమో, స్టడీ కండక్ట్ సర్టిఫికెట్, కులం, ఆదాయ సర్టిఫికేట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ముంపు బాధితులను ఆదుకోవాలని వినతి


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

చింతపల్లి : మండల పరిధిలోని కిష్టరాయినిపల్లి, ఈదులగండి ముంపు బాధితులు తమను ఆదుకోవాలని కోరుతూ సోమవారం దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. మార్కెట్‌లో ధరలకు అనుగుణంగా తమ భూములకు పరిహారం చెల్లించడంతో పాటు పూర్తిగా ముంపునకు గురవుతున్న ఈదులగండి గ్రామస్తులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య, రమేష్, యాదగిరి,కృష్ణయ్య, శ్రీను, నగేష్, అంజయ్య పాల్గొన్నారు.

పాలేరుకు కృష్ణాజలాలు.. చోద్యం చూస్తున్న మంత్రులు

మిర్యాలగూడ : జిల్లాలో ఎండిపోయిన చెరువులు, కుంటలను నింపకుండా ఖమ్మం జిల్లా పాలేరుకు కృష్ణా జలాలు తరలించుకెళ్తున్నా నల్లగొండ జిల్లా మంత్రులుల చోద్యం చూస్తున్నారని మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు ఆరోపించారు. సోమవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ నల్లగొండ జిల్లాను ఎండబెట్టి ఇప్పటికీ మూడుసార్లు ఖమ్మం జిల్లా పాలేరు జలాశయానికి నీటిని తరలించుకెళ్తున్నా మంత్రులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, ఇలాంటి చేతగాని మంత్రులు మనకు ఉండడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా నల్లగొండ, మిర్యాలగూడలోని సాగర్ ఆయకట్టు రైతుల ఇబ్బందులను గుర్తించి వెంటనే సాగర్ ఎడమకాల్వ ద్వారా నీటిని విడుదల చేసి జిల్లాలోని చెరువులను, కుంటలను నింపాలని ఆయన డిమాండ్ చేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మిర్యాలగూడ టౌన్ : ఓ ఇంట్లో నిల్వ ఉన్న పీడీఎస్ బియ్యం పట్టుకున్న సంఘటన సోమవారం మండలంలోని ఆలగడపలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ కె. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఆ గ్రామానికి చెందిన జిల్లా అంజమ్మ ఇంటి వరండాలో పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచారని, డయల్ 100 కు సమాచారం అందించారు. దీంతో ఆమె ఇంటికి వెళ్లి తనిఖీ చేయగా 5క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వచ్చిన ఫిర్యాదు మేరకు ఆమెపై సివిల్ సప్లయ్ యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సదురు వ్యక్తి తెల్ల రేషన్ కార్డుల నుంచి తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఎక్కువ ధరలకు అమ్ముకుంటున్నారన్నారు. అక్రమంగా నిల్వ ఉంచినందుకు గాను ఆమెపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మణ్‌నాయక్



లక్ష్మణ్‌నాయక్‌ను సన్మానిస్తున్న సభ్యులు

కొండమల్లేపల్లి : లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మణ్‌నాయక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలువురు సోమవారం ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రమావత్ దేవోజీ, రామునాయక్, భీమానాయక్, మనోజ్, వినయ్, లక్ష్మణ్, బాబు పాల్గొన్నారు.

అమరేందర్‌రెడ్డిని అభినందించిన సీఎం


అమరేందర్‌రెడ్డిని అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : 'కృత్రిమ మేధా ద్వారా వచ్చే న్యాయపరమైన-నైతికపరమైన చిక్కులు' అనే అంశంపై డాక్టర్ అమరేందర్‌రెడ్డి పీహెచ్‌డీని పూర్తి చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డిలు సోమవారం అమరేందర్‌రెడ్డిని అభినందించారు.

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

● దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

పెద్దఅడిశర్లపల్లి : పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం మండలంలోని అజ్మాపురం గ్రామంలో గ్రంథాలయ భవన ప్రారంభోత్సవం, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన, నక్కల పెంటతండాల్లో నూతన గ్రామపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన, మండల కేంద్రంలో పీఏసీఎస్ గోదాంల ప్రారంభోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసిందన్నారు. నియోజకవర్గంలో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీసీఓ విజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ మణిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.


పెద్దఅడిశర్లపల్లి : గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్, డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

కొండమల్లేపల్లి : దేవరకొండ మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తనవంతుకృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం దేవరకొండ మున్సిపాలిటీలో నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి దేవరకొండ అభివృద్ధికి నిధుల కేటాయింపునకు కృషి చేస్తానన్నారు. ఆయా వార్డులలో సమస్యలను పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న అధికారులను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, కమిషనర్ భాస్కర్ రెడ్డి, వడ్త్య దేవేందర్‌నాయక్, హనుమంతు వెంకటేష్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కొండమల్లేపల్లి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించండి

● మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం దామరచర్ల మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని సిబ్బందిని అడిగి తెలుసుకోని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పాఠశాల తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. 'నేను నా మిర్యాలగూడ' కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వన మహోత్సవంలో ప్రతి ఒక్క విద్యార్థి మొక్కను నాటి విద్యా సంవత్సరం పూర్తయ్యే వరకు సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీనాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థు పాల్గొన్నారు.


మిర్యాలగూడ : ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ప్రజావాణిలో 7 దరఖాస్తులు

హాలియా : అనుముల మండల కేంద్రంలో సోమవారం ఎంపీడీఓ కార్యాలయం లో నిర్వహించిన ప్రజావాణికి 7దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ సుజాత తెలిపారు. ప్రజావాణిలో వివిధ సమస్యలపై పలు దరఖాస్తులు రాగా వాటిలో 6 దరఖాస్తులను అధికారులు వెంటనే వాటిని పరిష్కరించారు. రెవెన్యూ సమస్యకు సంబంధించి మరొక దరఖాస్తులు వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు.

38 దరఖాస్తులు స్వీకరణ

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 38 దరఖాస్తులను స్వీకరించినట్లు ఎంపీడీఓ రాంరెడ్డి తెలిపారు. మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా రైతు రుణమాఫీకి సంబంధించి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు

డిండి : వేగంగా వస్తున్న కారు అదుపు తప్పడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన పున్న దినేష్, తవిటి సందీప్‌తోపాటు చెర్కుపల్లి గ్రామానికి చెందిన సందీప్‌రెడ్డిలు కారులో ఆదివారం రాత్రి చెర్కుపల్లి నుండి డిండికి ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలోని ఏనకుంట సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి రోడ్డు ప్రక్కనే ఉన్న ముళ పొదల్లోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న దినేష్, సందీప్‌రెడ్డికి గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్సకు దినేష్‌ను హైదరాబాద్ యశోద ఆస్పత్రి, సందీప్‌రెడ్డిని నాగర్‌కర్నూల్ యన్నమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ భూమిని దళితులకు పంచాలి

● మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : మిర్యాలగూడ మండలంలోని తడకమళ్లలో సర్వే నంబర్ 719లోని ప్రభుత్వ భూమిని తక్షణమే భూములు లేని పేద దళితులకు పంపిణీ చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన ప్రభుత్వ భూమిని పరిశీలించి మాట్లాడారు. గత ప్రభుత్వం దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని మొండి చేయి చూపిందని, ఈ ప్రభుత్వమైనా భూమి లేని దళితులకు తడకమళ్ల గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములను పంచాలన్నారు. లేనట్లయితే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తామే పేదలకు భూములను పంచుతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు రవినాయక్, జిల్లా నగేష్, వెంకటయ్య, సుధాకర్, మచ్చ వెంకన్న, జిల్లా సైదులు, మచ్చ మైసయ్య, బొజ్జ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


తడకమళ్లలో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న జూలకంటి రంగారెడ్డి

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ క్యాంపస్‌కు స్థల పరిశీలన

కొండమల్లేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ క్యాంపస్ పేరుతో గురుకులాలను ఒకే చోట ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో భాగంగా మొదటగా పైలెట్ ప్రాజెక్టుగా కొడంగల్, మధిర నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పాఠశాల ఏర్పాటు చేయడానికి సుమారు 190 ఎకరాలు అవసరం ఉంటుంది. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ మినీ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దెలా ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తుంది. సోమవారం కోల్‌ముంతలపహాడ్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, ఆర్డీఓ శ్రీరాములుతో కలిసి స్థల పరిశీలన చేపట్టారు. వీరి వెంట తహసీల్దార్ అనురాధ, సిరాజ్‌ఖాన్, వెంకటేశ్వర్ రావు ఉన్నారు.


స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

దాశరథి జీవితం యువతకు ఆదర్శం


దాశరథి కృష్ణమాచార్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హాలియా : మహాకవి దాశరథి కృష్ణమాచార్య జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని కాంగ్రెస్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి అన్నారు. పీఆర్‌టీయూ టీఎస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని కవి దాశరథ కృష్ణమాచార్య 100వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాకవి దాశరథి కృష్ణమాచార్య చిత్ర పటానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం బానిసత్వ విముక్తి కోసం పోరాడిన యోధుడు, తెలంగాణ విముక్తి కోసం ఉద్యమించి 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి ప్రేరణ ఇచ్చిన ప్రజా గొంతుక మహాకవి దాశరథి కృష్ణమాచార్య అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కొంగరి సత్యనారాయణ, నెమలి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మందా సైదులురావు గౌతమ్, మారం రవీందర్, మేదరి దేవేందర్, పరుశురాం గౌడ్, కున్‌రెడ్డి సైదిరెడ్డి, ఆకురాతి అమృతయ్య, జంగాల సైదులు ఉన్నారు.

మిర్యాలగూడ ఆర్టీసీ డీఎం బాధ్యతల స్వీకరణ


నూతన డీఎం రాంమోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎం బొల్లెద్దు పాల్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా రాంమోహన్‌రెడ్డి సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న బొల్లెద్దు పాల్ ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల కార్గో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్(ఎటీఎం)గా బదిలీ కాగా ఆయన స్థానంలో నల్లగొండ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న గంగుల రాంమోహన్‌రెడ్డి బదిలీపై మిర్యాలగూడకు వచ్చారు. ముందుగా నూతనంగా వచ్చిన డీఎంను ప్రస్తుత డీఎం పాల్ పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డీఎం రాంమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికులందరి సహకారంతోకరంతో ఆదాయం ఎక్కువ వచ్చేందుకు కృషి చేయడంతో పాటు ఆదర్శ డిపోగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్(సీఐ) భారతీబాయి, ఎంఎఫ్ పుష్పాల యాదగిరిలతో పాటు వివిధ యూనియన్ల నాయకులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

మిర్యాలగూడ టౌన్ : సీజనల్ వ్యాధులపై ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏఎన్ఎం, ఆశవర్కర్లతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మున్సిపాలిటీలో దోమల నియంత్రణకు ప్రత్యేకంగా ఫాగింగ్ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలో వారం రోజుల పాటు స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. పట్టణ ప్రజలు కూడా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్లలో నీటి నిలవ్వలు ఉంచుకోకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు నిపుణ, సంజయ్, సీహెచ్ఓ ప్రభాకర్, విద్యుత్ ఏఈ వెంకట్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ, టీఎంసీ పాతేపాక బక్కయ్య, సీఓ మామిడాల శ్రీనివాస్ తదితరులున్నారు.


మిర్యాలగూడ టౌన్ : మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ యూసుఫ్

త్రిపురారం : వర్షాల కారణంగా సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ శంకర్ నాయక్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయ కుమారి సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో త్రిపురారం, పెద్దదేవుల పల్లి ప్రాథమిక ఆరోగ్య కేందంలోని వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో నీటి తొట్లు, వాటర్ ట్యాంక్‌లు శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీఓ రాజేంద్ర కుమార్, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు, పలువురు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 5వరకు రైతు బీమా దరఖాస్తు గడువు

హాలియా : భూమి పట్టా ఉన్న రైతులు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని హాలియా వ్యవసాయ అధికారి సరిత సోమవారం ఒక ప్రకటనలో కోరారు. జూన్ 28, 2024లోపు భూమి పట్టా కలిగి ఉండి 18నుంచి 59 ఏళ్ల వరకు ప్రతి రైతు ప్రభుత్వం అందించే రైతు బీమాకు అర్హులని తెలిపారు. . రైతులు రైతు బీమా కోసం స్థానిక ఏఈఓలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అడవిదేవులపల్లి : అర్హులైన రైతులందరూ ఆగస్టు 5వ తేదీ వరకు రైతు బీమాకు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సైదా అన్నారు. సోమవారం స్థానికంగా రైతు రుణ మాఫీ ఫిర్యాదులను అధికారులు మండల వ్యవస్యా అధికారి సైదా, ఎంపీడీఓ కరుణాకర్, మండల తహసీల్దార్ సురేశ్‌కుమార్‌లు స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు మహేష్‌నాయక్, రావుల నరేష్‌లతో పాటు రైతులు తదితరులున్నారు.


దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): జూన్ 28 కంటే ముందు ధరణిలో రిజిస్ట్రేషన్ అయిన పట్టాదారులు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఓ ఎర్రంశెట్టి జానకి రాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారి నామిని మరణించినట్లయితే నామిని పేరు మార్చుకోవడానికి, ఇతర ఏవైన తప్పులు ఉన్నట్లయితే జూలై 30వ తేదీలోపు సరిచేసుకోవడానికి అవకాశం ఉన్నట్లు ఆయన సూచించారు.

పోడు భూములకు పట్టాలు అందించాలి

మిర్యాలగూడ : ఎన్నో ఏళ్లుగా పోడు భూములను సాగు చేసుకుంటున్న రైతులుకు పట్టాలు అందించి వారి సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. సోమవారం దామరచర్ల మండల కేంద్రంలో నిర్వహించిన మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం అసైన్డ్ పోడు రైతులకు పట్టాలు అందించకుండా రైతుల మీద అక్రమ కేసులు బనాయించి భూమిని గుంజుకునే ప్రయత్నం చేసిందని, ధరణి పేరుతో తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పోలెపల్లి ఉదయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించచన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి లింగానాయక్, నాయకులు కోటయ్య, శాంత, బుజ్జి, పాల్గొన్నారు.

పీఆర్‌టీయూతోనే సమస్యలు పరిష్కారం


త్రిపురారం : సభ్యత్వం తీసుకుంటున్న టీచర్లు

త్రిపురారం : ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యమని పీఆర్‌టీయూ త్రిపురారం మండల అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని పలు పాఠశాలలో సభ్యత్వ కార్యక్రమం నిర్వహించి ఉపాధ్యాయులకు సభ్యత్వాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకయ్య యాదవ్, విష్ణు కుమార్, వెంకట్ పరమేష్, హెచ్ఎం సైదిరెడ్డి, సైదయ్య, స్వామి, దశరథ నాయక్, విజయలక్ష్మీ, శ్రీనివాస్, లక్ష్మీ, ఝున్సీ, కపూర, లలిత, పాల్గొన్నారు.

చింతపల్లి : మండల పరిధిలోని కుర్మేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సుధీర్‌కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, దేవేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, వాసుదేవ రెడ్డి, లక్ష్మి, యాదయ్య, రమేస్ పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ హామీ అమలు చేయాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే బీసీ డిక్లరేషన్‌ను అమలు చేస్తామని చెప్పి ఏడు నెలలు అవుతున్నా ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మెండె అనిల్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరుతూ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు గోగు వెంకన్న ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

కొండమల్లేపల్లి : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు సోమవారం దేవరకొండ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేతాళ్ల వెంకటేష్ మాట్లాడారు. వినతిపత్రం అందజేసినవారిలో బీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణదాసు చండీశ్వర్, వస్కుల సుధాకర్, అంజయ్య,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

మిర్యాలగూడ : విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శి కుర్ర జగన్, సైదానాయక్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు సన్న బియ్యం, దుప్పట్లు, ట్రంక్ పెట్టెలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేయాలని పలుమార్లు ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాలు అందించినా పట్టించుకోకపోవడంతో విద్యార్థులు త్రీ ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వీరన్ననాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జ్‌గా తిరుపతినాయక్

డిండి : లంబాడీ హక్కుల ఐక్య వేదిక జిల్లా ఇన్‌చార్జీగా మండల పరిధిలోని ప్రతాప్‌నగర్ గ్రామానికి చెందిన జర్పుల తిరుపతినాయక్‌ను నియమించినట్లు ఆసంఘం స్టేట్ చీఫ్ కోఆర్డినేటర్ జాదవ్ రమేష్ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి జిల్లా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పజెప్పిన రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్‌తో పాటు ఎన్నికకు సహకరించిన వారందరికి తిరుపతినాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

గుర్రంపోడు : మండలంలోని మొసంగి ప్రాథమికోన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఎస్. రాజేశ్వర్‌ను సోమవారం పాఠశాల హెచ్ఎం దేవేందర్, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. 11ఏళ్లుగా పాఠశాల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యం, వీరన్న, గోపాల్, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని వినతి

మిర్యాలగూడ టౌన్ : ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని నియంత్రించడంతో పాటు విద్యా వ్యాపారాన్ని పూర్తిగా అరికట్టాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. సోమవారం బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఫీజుల నియంత్రించాలని కోరుతూ ఆర్డీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ జమాల్‌కు వినతి పత్రం అందజేశారు.వినతి పత్రాన్ని అందజేసిన వారిలో రాయంచు నర్సింహ, నరేష్, అజయ్, హరీ, ఉపేందర్, నవీన్ పాల్గొన్నారు.

గోపయ్య ఆశయాలు సాధిద్దాం

మిర్యాలగూడ అర్బన్ : పేద ప్రజల సంక్షేమం కోసం రాజీలేని పోరాటాలు చేసిన పోలేబోయిన గోపయ్య ఆశయాలను సాధించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేశ్ అన్నారు. సోమవారం సీపీఎం నాయకుడు గోపయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిలా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకులు గౌతంరెడ్డి, పాండు, పరశురాములు, వరలక్ష్మి, పద్మ ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం బీజేపీదే

వేములపల్లి : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించేలా కృషి చేయాలని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎడ్ల రమేష్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు, మండల అధ్యక్షుడు సాంబమూర్తి, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

మిర్యాలగూడ : పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులను వెంటనే విడుదల చేయాలని కార్మికులు సోమవారం పట్టణంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మధ్యాహ్న భోజన కార్మికులు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరీమున్నీసా, మంగా, సైదమ్మ, పద్మ పాల్గొన్నారు.

నీటిపారుదల సీఈకి..

మిర్యాలగూడ అర్బన్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్నెస్పీ ఎల్‌బీసీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మిర్యాలగూడకు వచ్చిన నీటిపారుదల సీఈకి వినతి పత్రం అందజేశారు. రెండేళ్లుగా సాగర్ డ్యామ్ పరిధిలో మిర్యాలగూడ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న వర్క్ ఇన్స్పెక్టర్లకు టీఏ బిల్లులు రావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి పరికే వెంకటేశ్వర్లు, కోశాధికారి ఎలవెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

వేములపల్లి (మాడుగులపల్లి): మాడుగులపల్లి మండలం ఇందుగుల గ్రామానికి చెందిన పందిరి రాధికకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ.51వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కల్లు శ్రీనివాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంద్రారెడ్డి, మునుగోటి యాదగిరి, పందిరి దయాకర్, కల్లు జగన్‌రెడ్డి, సైదులు, జానిపాషా, ఏడుకొండలు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ : వీఆర్ఓ వ్యవస్థను తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి వీఆర్ఓలు సోమవారం వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏకపక్షంగా వీఆర్ఓల వ్యవస్థను రద్దు చేసిందని, తిరిగి పునరుద్ధరించాలని కోరారు. ఈ వినతి ఇచ్చినవారిలో నిరంజన్ తదితరులు ఉన్నారు.

24న విద్యుత్ గ్రీవెన్స్ డే

గుర్రంపోడు : మండలంలోని విద్యుత్ వినియోగదారులు సమస్యల పరిష్కారానికి ఈ నెల 24న నాంపల్లి సబ్‌స్టేషన్ లో కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రసిల్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు ఏడీఏ ఎం. సాగర్ రెడ్డి, ఏఈ శ్రీకాంత్ రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఆధార్ పట్టాదారు పానుపుస్తకం జీరాక్స్‌తో రావాలన్నారు.